# జిల్లాలో విస్తృత తనిఖీలు

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి

రాంనగర్, నవంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అక్రమంగా డబ్బు, మద్యం, ప్రజలను ప్రలోభపెట్టే ఇతర వస్తువుల అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లాలో విస్తృత స్థాయిలో వాహన తనిఖీలు చేపడుతున్నామని పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని పలుచోట్ల కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా హెడ్‌క్వార్టర్స్ పోలీసులు ఉమ్మడి బృందంగా ఏర్పడి పక్కా సమాచారంతో ఆకస్మిక తనిఖీలు, మెరుపు దాడులు చేస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ తనిఖీ**

మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గపరిధిలో గల ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన లేదా అల్లర్లను సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయడంతో పాటు వారి కదలికలపై ఎప్పటికప్పుడూ నిఘా ఉంచాలన్నారు. అనంతరం రేణిగుంట టోల్ ప్లాజా వద్ద గల స్టాటిక్ సర్వేలైన్స్ టీం ఆధ్వర్యంలో గల చెక్‌పోస్టును తనిఖీ చేశారు, విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహన తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో ఏ వాహనాన్ని విడిచిపెట్టకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమ తరలింపులను గుర్తించినట్లయితే సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ చేయించాలన్నారు. ఆయన వెంట కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, తిమ్మాపూర్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఎల్ ఎండీ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి



నగరంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

# బీఆర్ఎస్ కార్యకర్తకు మంత్రి పరామర్శ



వెంకటేశ్‌ను పరామర్శిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 2: మండలంలోని ఆసీఫ్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వెంకటేశ్ తల్లి రాయమల్లవ్వ ఇటీవల మృతి చెందింది. కాగా, గురువారం మంత్రి గంగుల కమలాకర్ వెళ్లి రాయమల్లవ్వ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట ఎంపీపీ పిల్లి శ్రీలత-మహేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, ఎంపీటీసీ కమల మనోహర్, కో-ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, సర్పంచ్ కడారి శాంత-శ్రీనివాస్ తదితరులున్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, నవంబర్ 2: నగరంలోని 11కేవీ శక్తి టెంపుల్ ఫీడర్ పరిధిలో డీటీఆర్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యానగర్, సంతోష్‌నగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ప్రాంతం, సెయింట్ జాన్స్ స్కూల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్ చేస్తే రాయితీ
- ఆరుగురికి ఉచిత ప్రయాణ సదుపాయం
- ఆర్ఎం సుచరిత వెల్లడి

తెలంగాణచౌక్, నవంబర్ 2: శబరిమల స్వామి దర్శనం కోసం వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ రీజనల్ మేనేజర్ సుచరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కొత్తగా కొనుగోలు చేసిన సూపర్ లగ్జరీ బస్సులను అయ్యప్ప భక్తుల కోసం అద్దె ప్రాతిపదికన సమకూరుస్తామన్నారు. భక్తులకు కేటాయించే సూపర్ లగ్జరీ బస్సులో ప్రత్యేక సదుపాయలు ఉన్నాయన్నారు. ఎల్ఈడీ టీవీతో పాటు సెల్ చార్జింగ్, బకెట్ సీట్లు లాంటి సదుపాయాలు కల్పించామన్నారు. శమరిమలకు వెళ్లడానికి బస్సును అద్దెకు తీసుకునే గురుస్వామికి, ఇద్దరు మణికంఠ స్వాములకు, ఇద్దరు వంట మనుషులతో పాటు మరో సహాయకుడికి ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఒక్క బస్సుకంటే ఎక్కువ బస్సులను బుకింగ్ చేసే గురుస్వామికి ప్రత్యేకంగా రోజుకు ₹300 చొప్పున కమీషన్ అందజేస్తామన్నారు. శబరిమలతో పాటు అదే దారిలో ఉన్న ఇతర పుణ్యక్షేత్రాలను కూడ దర్శించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం రాయితీలతో టీఎస్ ఆర్టీసీ కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాన్ని ఉమ్మడి జిల్లాలోని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అద్దె బస్సుల కోసం ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.



పూజలు చేస్తున్న వేద పండితులు

## వైభవంగా మహాభిషేకం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 2: నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సుప్రభాతం, కొలువు, తోమాలసేవ, హనుమంత వాహనసేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఔషధులు, పవిత్ర నదీ జలాలతో మహాభిషేకం చేశారు. సాయంత్రం డోలోత్సవం నేత్రపర్వంగా నిర్వహించగా, రాత్రి ముత్యాల పందిరి వాహనంలో శ్రీవారు భక్తులకు దర్శనమిస్తూ కనువిందు చేశారు. సర్వవైదిక సంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గోటితో ఒలిచే తలంబ్రాలు తీసుకెళ్తున్న భక్తులు

# భద్రాద్రిలో వరి పంటకు సీమంతం

- హాజరైన కరీంనగర్ భక్తులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 2: అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో 12 సంవత్సరాలుగా గోటితో తలంబ్రాలను ఒలిచి భద్రాచలం, ఒంటిమిట్ట, అయోధ్యలో సమర్పించే కార్యక్రమంలో భాగంగా గురువారం అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కల్యాణం అప్పారావు, నలుమాచు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భద్రాచలంలో పొట్ట దశలో ఉన్న వరి పంటకు సీమంతం చేశారు. రాజమండ్రి, కోరుకొండ, హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన 40 మంది రామ భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో రమాదేవి, ఇతర అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో కరీంనగర్ నుంచి రాణి, ప్రదీప్, రజిత, శైలజ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సంవత్సరం కూడా మూడు చోట్ల గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సమర్పించనున్నామని, అయోధ్యలో ఫిబ్రవరిలో జరిగే 4వ కోటి వత్తుల దీపోత్సవంలో మూడు రాష్ట్రాల నుంచి మూడు వేల కుటుంబాలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

# నమ్మితే నట్టేట ముంచాడు

- చిట్‌ఫండ్ యజమాని నిర్వాకం
- చిట్టీ డబ్బుల కోసం బాధితుల ఆందోళన

కలెక్టరేట్, నవంబర్ 2: పైసా పైసా కూడబెట్టి తమ కుటుంబ ఆర్థిక అవసరాలు తీర్చుకుందామనుకుని నాలుగు డబ్బులు చిట్‌ఫండ్ సంస్థలో పోగేసుకుంటే, నమ్మిన వారిని నట్టేట ముంచాడు. సేకరించిన మొత్తాన్ని వెనుకేసుకుని, చిట్టీ డబ్బులు చెల్లించకుండా ముఖం చాటేశాడు. ఆ చిట్‌ఫండ్ సంస్థ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయిన బాధితులు తమ డబ్బులు ఇప్పించాలంటూ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ చిట్‌ఫండ్ సంస్థ యజమాని ఉమ్మడి జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో శాఖలు ఏర్పాటు చేసి ఏజంట్ల ద్వారా వందల సంఖ్యలో మందిని చిట్టీదారులుగా చేర్పించి, నెలనెలా ఠంచనుగా డబ్బులు వసూలు చేశాడు. ఐదు లక్షల నుంచి రెండు కోట్ల వరకు డిపాజిట్లు కూడా సేకరించాడు. ఈ మొత్తాన్ని ప్రతి నెల పాడే వేలం పాటలో చిట్టీ దక్కించుకున్న వారికి వెంటనే అందజేయాల్సి ఉంటుంది. అయితే, నెలలు గడుస్తున్నా చెల్లించకుండా, కుంటి సాకులు చెబుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నాడు. ఓపిక నశించిన చిట్టీదారులు తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చినా పట్టించుకోకపోవడంతో, వారం క్రితం ఉమ్మడి జిల్లాలోని సదరు చిట్‌ఫండ్ సంస్థ శాఖలకు ఏజంట్లతో పాటు డిపాజిట్‌దారులు కలిసి తాళాలు వేశారు. జిల్లా రిజిస్ట్రార్‌కు కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఆర్ సంబంధిత చిట్‌ఫండ్ సంస్థ యజమానిని డీఆర్ కార్యాలయానికి గురువారం పిలిపించగా, వచ్చిన ఆయన బాధితులను మరోసారి మభ్యపెట్టే ప్రయత్నం చేశాడు. దీంతో కోపోద్రిక్తులైన వారు సదరు యజమానిని డీఆర్ చాంబర్‌లో బంధించే యత్నం చేశారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందజేయగా, అక్కడకు చేరుకున్న పోలీసులు సమస్యను పరిష్కరించే యత్నం చేశారు. అయినా, బాధితులు ససేమిరా అనడంతో వారికి చిట్‌ఫండ్ యజమాని నుంచి లిఖితపూర్వక హామీ పత్రం రాయించి ఇవ్వడంతో శాంతించారు.

**డీఆర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్**

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని సస్పెన్షన్ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు వెలువరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఓ చిట్‌ఫండ్ సంస్థకు సంబంధించిన కోట్లాది రూపాయల విలువైన డిపాజిట్ బాండ్లు విడుదల చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై శాఖాపరమైన విచారణ జరిపిన అధికారులు బాండ్ల విడుదల చేసి సదరు సీనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయగా, స్పందించకపోవడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా, సస్పెన్షన్ విషయం తెలుసుకున్న సదరు ఉద్యోగి దీర్ఘకాలిక సెలవు పెట్టినట్లు సమాచారం.

## ఆరు గ్యారంటీలను నమ్మవద్దు

ఇల్లంతకుంట, నవంబర్ 2: సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేకే.. ఆరు గ్యారంటీలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మీ ముందుకువస్తున్నారని.. వారిని మరోసారి నమ్మితే మోసపోవడం ఖాయమని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. కందికట్కూర్‌కు చెందిన 50 మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గురువారం తిమ్మాపూర్‌లోని క్యాంపు కార్యా లయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి రసమయి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి, మాట్లాడారు. కేసీఆర్ సర్కారు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై, ఆయా పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ బూటకపు హామీలు, మాయమాటలను నమ్మితే గోస పడుతామన్నారు. ఈ తొమ్మిదిన్నర ఏండ్లలో ఎంతో అభివృద్ధి చేశామని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.